# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-08-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **అంతరిక్షంలో భారత దేశ ప్రయాణం మన దృఢ సంకల్పం, ఆవిష్కరణలు మన శాస్త్రవేత్తల ప్రతిభను వెల్లడిస్తుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.**
2. **రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పెద్దాపురంలో స్వచ్ఛతా ర్యాలీని ప్రారంభించారు.**
3. **తెలుగు వారిలో స్వాతంత్ర కాంక్షను రగిల్చిన త్యాగధనుడు టంగుటూరి ప్రకాశం పంతులు అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కొనియాడారు.**
4. **నర్సింగ్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు జర్మనీలో ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి వెల్లడించారు.**
5. **ఎరువుల బ్లాక్ మార్కెటింగ్ అరికట్టేందుకు రాష్ట్ర వ్యాప్తంగా దాడులు నిర్వహిస్తున్నట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ హరీష్‌కుమార్ గుప్తా పేర్కొన్నారు.**

==========================

అంతరిక్షంలో భారత దేశ ప్రయాణం మన దృడ సంకల్పం, ఆవిష్కరణలు మన శాస్త్రవేత్తల ప్రతిభను వెల్లడిస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు. జాతీయ అంతరిక్ష దినోత్సవంపై సామాజిక మాధ్యమం వేదికగా స్పందించారు. ఇటీవల తాను శుభాన్షు శుక్లాను కలిశానని, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో త్రివర్ణ పతాకాన్ని ఎగరవేసిన ఆయన ప్రతి భారతీయుడు గర్వపడే విధంగా చేశారన్నారు. దేశ కలలను సాకారం చేయడానికి ఆస్ట్రోనాట్ పూల్ సిద్ధం చేస్తున్నామని పేర్కొంటూ...

వాయిస్...30 సెకన్లు

--------------------------

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పెద్దాపురంలో పర్యటిస్తున్నారు. పెద్దాపురంలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మ్యాజిక్ డ్రైన్, స్వచ్ఛ రథాలను పరిశీలించారు. అనంతరం స్వచ్ఛతా ర్యాలీని ప్రారంభించి, స్థానికులు, విద్యార్థులతో కలిసి ప్రజా వేదిక వరకు ర్యాలీలో పాల్గొన్నారు. అక్కడ ఉన్న స్టాల్స్ ను సందర్శించారు. ప్రజా వేదిక నుంచి స్థానికులతో ముఖ్యమంత్రి మాట్లాడనున్నారు.

--------------------------

తెలుగు వారిలో స్వాతంత్ర కాంక్షను రగిల్చిన దీరోదాత్తుడు, త్యాగధనుడు టంగుటూరి ప్రకాశం పంతులు అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుదు కొనియాడారు. టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా గుంటూరు జిల్లా ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలవేసి ముఖ్యమంత్రి నివాళి అర్పించారు. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రగతికి బాటలు వేసిన ఆయన ప్రజాసేవలను, దేశభక్తిని, ఈ సందర్భంగా స్మరించుకుందామని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

-------------------------

నర్సింగ్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు జర్మనీలో ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. తిరుపతిలో నిన్న ఎస్సీ, ఎస్టీ నర్సింగ్ విద్యార్థులకు జర్మన్ భాష ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ .. ఈ శిక్షణ, నియామక కార్యక్రమాలు తొలుత గుంటూరు, విశాఖపట్నం తిరుపతి, కర్నూలు, కాకినాడ లలో ప్రారంభిస్తున్నట్లు చెప్పారు.

అదేవిధంగా తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారుల ప్రాంతీయ సదస్సును సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి నిన్న ప్రారంభించారు. వసతి గృహాల్లో వంద శాతం అడ్మిషన్లు, ఉత్తీర్ణతే లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. డైట్, వసతి గృహాల మరమ్మతుల బిల్లులను సకాలంలో నమోదు చేయాలన్నారు.

-------------------------

ఎరువుల బ్లాక్ మార్కెటింగ్ అరికట్టేందుకు రాష్ట్ర వ్యాప్తంగా దాడులు నిర్వహిస్తున్నట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టర్ జనరల్ హరీష్‌కుమార్ గుప్తా తెలిపారు. యూరియాను దారి మళ్లించడం, అక్రమంగా నిల్వ చేయడం, బ్లాక్ మార్కెటింగ్ చేయడం చట్ట విరుద్ధమే కాకుండా రైతులకు ఇబ్బంది కలిగిస్తుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర వ్యాప్తంగా విజిలెన్స్ బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నాయని, అక్రమ చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. యూరియా అక్రమ నిల్వలు, దారి మళ్లింపుకు సంబంధించిన సమాచారం తెలిసిన వారు సమీపంలోని విజిలెన్స్ కార్యాలయానికి తెలపాలని ఆయన కోరారు.

-------------------------

స్వాతంత్ర పోరాటంలో బ్రిటిష్ పాలకులను ఎదిరించిన ధైర్యశాలి టంగుటూరి ప్రకాశం పంతులు అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 153వ జయంతి వేడుకలను ఈరోజు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా అనేక సంస్కరణలను ప్రకాశం పంతులు తీసుకు వచ్చారన్నారు. ప్రతి ఒక్కరూ ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొంటూ..

వాయిస్... 33 సెకన్లు

-------------------------

ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల ఆగడాలకు చెక్ పెడుతూ కేంద్రం తీసుకువచ్చిన 'ది ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు-2025'.. వ్యసనం, ఆర్థిక భద్రత, మోసం, మనీలాండరింగ్ వంటి తీవ్రమైన సామాజిక సమస్యలను పరిష్కరిస్తుందని ఎన్టీఆర్ జిల్లా డిప్యూటీ పోలీస్ కమీషనర్ కే జి వి సరిత తెలిపారు. విజయవాడలో ఆమె మాట్లాడుతూ.. ఈ బిల్ ద్వారా ఆన్‌లైన్ -స్పోర్ట్స్‌కి అధికారిక గుర్తింపు, అలాగే శిక్షణా కేంద్రాలు, అకాడమీలు, పరిశోధన కేంద్రాల ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుందని, దీంతో భారతీయ విలువలతో గేమ్స్ ప్రోత్సాహం లభిస్తుందన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి కుటుంబాలు కాపాడబడతాయని పేర్కొంటూ..

వాయిస్.... 28 సెకన్లు

---------------------------

సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యులు సురవరం సుధాకర్‌రెడ్డి మరణించారు. అనారోగ్య సమస్యలతో కొద్ది రోజులుగా బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లో ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నిన్నరాత్రి మృతి చెందారని కుటుంబ సభ్యులు వెల్లడించారు. హైదరాబాద్ మణికొండలో నివసిస్తున్న ఆయనకు భార్య విజయలక్ష్మి, కుమారులు నిఖిల్, కపిల్ ఉన్నారు. విద్యార్థి ఉద్యమాల నుంచి జాతీయ రాజకీయాల దాకా ఎదిగిన ఆయన... మూడు దఫాలు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. సురవరం సుధాకర్ రెడ్డి మృతికి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు వై.ఎస్ షర్మిల, సిపిఎం రాష్ట కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తదితరులు సుధాకర్ రెడ్డి మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానంలో దిగువ ట్రోపో ఆవరణంలో పశ్చిమ గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న మూడు రోజులు పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు ఒకటి, రెండు చోట్ల కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ఎల్.నారాయణ తెలియజేస్తూ...

వాయిస్..23 సెకన్లు

---------------------------

ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఈరోజు జరుపుకుంటున్నాం. 1872వ సంవత్సరం ఆగస్టు 23వ తేదీన ప్రకాశం జిల్లా వినోదరాయిని పాలెంలో జన్మించిన ఆయన... ఇంగ్లండులో బారిష్టర్ విద్యను అభ్యసించారు. కొంతకాలం మద్రాసులో న్యాయవాద వృత్తిని చేపట్టిన ఆయన 1922లో సహాయ నిరాకరణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు.

=====================